# జూదం

ఆ రాత్రి రెండు గంటలదాకా చదివి పడుకుందామని ప్రోగ్రాం వేసుకున్నాం నేనూ జానకిరాముడూనూ. పరీక్షలు వచ్చిపడుతున్నై; నాకు పోర్షన్లయినా తెలీదు, మా జానకిరాముడికి అవైనా తెలుసు. నాలుగ్గంటలకే జానకిరాముడు స్టేషను మాస్టరుగారబ్బాయి, గోవిందరాజు దగ్గిర స్టౌ తెచ్చాడు.

"ఇదెందుకురా?" అన్నాను.

"టీ"

"చా! అది తాగితే నిద్దర్రాదుట్రా!"

"రానినిద్దర తెప్పించదుకదా!"

"చాలా తాగితే నిద్దరొస్తుందని నీకనుమానంగా ఉంటే హోమియోపాతిక్‌గా ఒక చుక్క ఎడ్మినిష్టరు చేస్తాలే!"

అన్నవాడు భోం చెయ్యగానే ఎక్కడికి ఉడాయించాడో పది గంటలయినా ఐపులేదు. పోర్షన్లే ఎరగనివాణ్ణి ఏం చదవను? పోనీ తెల్లవారుజామునే లేచి చదువుకోవచ్చు, వెంటనే నిద్ర పోదామనుకుంటే, పుస్తకం పట్టందే నిద్దరెట్లా వస్తుంది? పదిన్నర కటూఇటూ జానకిరాముడు గూడు చేరుకున్నాడు. కాని మనలోకంలో ఉంటేనా?

"సరే, చదువు మొదలు పెడదాముట్రా?"

మాట్టాడ్డు.

"పోనీ, టీ కాయనుట్రా?"

పలకడు.

"అయితే పడుకుని శయనింతామట్రా?"

జవాబులేదు.

"ఏమిట్రా ఆలోచిస్తున్నావు?"

"ఊఁ?"

"ఏమిట్రా ఆలోచిస్తున్నదీ?"

"ఊఁ?"

మూడోసారి మళ్ళీ వేసిన ఎత్తేవేస్తే ఆట "డ్రా" అవుతుందని మహా పెట్టాను. అంటే లేచివెళ్ళి వాణ్ణి కుర్చీమీదినించి కిందికి పడదోసి, పెంకులేరటం మొదలుపెట్టాను.

"ఊс! ఊరిభే! చెప్పేది గ్రహించకుండా!" అంటూ వాడు లేచి అవయవాలను యథాస్థానంలో అమర్చుకోసాగాడు.

"నువ్వేదో చెప్పినట్టు!" అన్నాను.

"అс! ఏముంది చెప్పేందుకు!

ఇవాళ నాగరాజుకు ముప్ఫయి రూపాయలు మనీ ఆర్డరు వచ్చింది, తెలుసునా?"

"ఎందుకొచ్చిందా అని ఏడుస్తున్నావా? వాళ్ళయ్య పదిమంది కాళ్లాపట్టుకొని వాడికి పాతిక రూపాయలూ పంపుతున్నాడు నెల నెలా."

"ఇంకేం, ఇవాళ వచ్చిన డబ్బంతా పంతులు కాజేశాడు!"

"దొంగతనమే! ఎవరైనా చూశారా? ఒరే, మనం ఎమెచూర్ పత్తేదార్లు కావటానికి మంచి చాన్సురా! ఏదీ "డేటా" యావత్తూ నా ముందుంచు. నేను కుర్చీలో కళ్ళుమూసుకొని పడుకుని ఆలకిస్తాను. నువ్వు వాట్సను వనుకుందాం!"

"దొంగతనమూకాదు నీ మొహమూకాదు. ఈ నాగాయి వెధవ వెళ్ళి వాడితో జూదమాడాడు."

"హారి! వీడిదుం – వీడి కిదివరకులేదే ఈ పొయ్యేకాలం. కావలసిందే – శిక్ష!"

"నువ్వంతా వినవా ఏం? తెలివిగలకుంక కదా అని ప్రిన్సిపల్ వీడికి ఎడ్మిషన్ అప్పుపెట్టాడు. ఆ అప్పుతీర్చి పైఖర్చుకుంచుకోమని వాళ్ళయ్య ఈ డబ్బు పంపాడు. వీడికి డబ్బు వచ్చిన సంగతి ఆ పక్షి పసికట్టాడు. తమాషాకు పేకాడతాం రమ్మన్నాట్ట పంతులు. నేనంత భాగ్యవంతుణ్ణి కాదు మహాప్రభో, నన్ను చంపకన్నాట్టనాగాయి. నవ్వులకేనోయి, నీ డబ్బెవరిక్కావాలి అన్నాట్ట పంతులు. నాకసలు చాతగాదన్నాట్ట నాగాయి. నాకు చాతవునా ఏమిటి? గంటసేపాడామంటే ఎవరి డబ్బు వారి దగ్గరే ఉంటుంది. అట్లా కాకపోతే జూదగాళ్ళు ఊళ్ళుకొనక పోయినారా అన్నాట్ట పంతులు. అప్పటికీ నాగాయి పడకపోవటం చూసి నీకు భయముటోయ్! అన్నాట్ట చాలా ఆశ్చర్యంగా! దాంతో పడ్డాడు. నా బుద్ధికి నాగాయి తప్పు జాస్తిగా కనపడదు. వాడికి జూదం విషయంగాని పంతులు దగ్గిర డబ్బులేని సంగతిగాని తెలీదు. వాడు గెలిస్తే పంతులు డబ్బు ఇచ్చి ఉండేవాడే. పంతులూ అంతేననుకున్నాడు."

"ఛా!" అన్నాను ఆశ్చర్యార్థకంగా.

"పాపం, నాగాయిని చూసితీరాలి జీవచ్ఛవమల్లే ఉన్నాడు. నాతో అంతా చెప్పాడు. వాడేదుస్తున్నాడురా, పాపం!"

"పంతుల్ని నిలవేసి చావదన్నితే? డబ్బు కక్కడూ?"

"నాగాయితో ఆ మాటే అన్నా. వాడికదినచ్చలేదు. ఆడముండల్లే మనచేత చెప్పిచేయించుకోవటం అట్లా ఉంచి, ఆ డబ్బుమీద తన హక్కును చేతులారా వదులుకున్న వాడికటువంటి పని చేయించటం తగదంటాడు. వాడు చెప్పేదాన్లో కొంత నిజం లేకపోలేదు. పైగా మనం ఆ పని చేస్తే వాడాత్మహత్య చేసుకుంటాడని నాకు గట్టి నమ్మకం. అంత మెతగ్గా ఉండే వాళ్ళెంతకయినా తగుదురు!"

ఈ విధంగానే కాస్సేపు మాట్టాడి నిద్రపోయినాం. మర్నాడు జానకిరాముడు ఈ ప్రశంసే ఎత్తలేదు! నేనెత్తినా సరిగా జవాబు చెప్పలేదు. నాకయినట్టుగానే వాడికీ ఒకరిద్దరితో దాని మీదనించి మనస్సుపోయింది కామల్లనుకున్నాను.

ఆ తరవాత వృత్తాంతం నాకు నారాయణవల్ల తెలిసింది. అదైనా వాడంతట వాడే బయటపెడితే –

"ఏమిట్రా, సీనూ, మీ జానకిగాడు కూడా మాలో కలిశాడే! వాణ్ణింకా మేం చదువొచ్చే వాళ్ళలో వేశామే! అయినా డబ్బున్నవాడేలే?" అన్నాడు నారాయణ.

"ఏమిట్రా? ఏమిట్రా?" అన్నానాశ్చర్యంతో.

"వాడు కూడా పలాసాడటానికి పంతులింటికొస్తున్నాడు. అయిదు రోజుల్నించీ! రోజూ రెండూ మూడు పెడుతున్నాడురా!"

"ఛా!"

"ఆc!"

"పంతులేనా గెలుస్తున్నది?"

"పంతులు కాదోయ్! వాడెవడో పంతులు స్నేహితుడల్లే ఉన్నాడు. ఇక్కడివాడు కాదు. ఎంత అద్భుతంగా ఆడతాడనుకున్నావురా? ముక్కలు చూసి నట్టాడతాడు. ఎట్లా ఆడతావింతాట అంటే, ఆc వెధవ పదిహేడు ముక్కల బతుకుతెలీకపోతే ప్రజ్ఞ ఏమిటన్నాడ్రా! ఒకసారి వాడికి వరస చూపించి రోజల్లా కలుపు, కత్తెరవెయ్యి, ముక్కల వరస చెబుతాడు. బలేవాడు!"

"ఛా!"

"ఆc!"

"వాడా ఇప్పుడు వీణ్ణి గొరగటం?"

"ఆc. పంతులిప్పుడాడటం లేదే! వాడిచేత ఆడిస్తాడు. రేపో ఎల్లుండో పెద్దాట ఆడతారట. అర్ధరూపాయి గేటు. ఎవర్నీ రానీరు. చూదామంటే, పోయి ఆడదామంటే.." డబ్బు లేదని సంజ్ఞచేశాడు.

జానకిరాముడానాడు కనపడగానే వాణ్ణి సతాయించాను. లాభంలేకపోయింది. ఎనుబోతు మీద వర్షం కురిసినట్లే వాడికి మాటలు.

ఆ తెల్లవారుజామునే పెద్దగోల. ఆ పలాసు ప్రొఫెసర్ను – అతని పేరు సీతారామయ్య అని తెలిసింది – మా జానకిగాడు తెల్లవారుజామున అయిదింటికి రోడ్డుమీద పడేసి చావదన్నాడు. ఆ వేళకు వాడు గదిలోలేడని నేను సాక్ష్యం ఇవ్వగలను. ఆ సీతారామయ్య మాత్రం "నేను సరిగా చూడలేదు. చెప్పలేను" అన్నాడుగాని దూరాన్నించి చూసినవాళ్ళు ఒకరిద్దరు మావాణ్ణి సరిగానే వర్ణించారు. జానకిరాముణ్ణే అడిగితే – ఉందిగా వనమూలిక – మాటాడ్డు.

నాకు చాలా అసహ్యమేసింది. ఆ నాగరాజు డబ్బు ఎట్లాగైనా తిరిగి సంపాదిద్దామని ఈ దరిద్ర పెద్దమ్మ తన డబ్బు కూడా పోగొట్టుకుంటున్నాడు. చదువుకూడా మాని! డిస్టింక్షన్ రావలసిన వెధవ! ఎవడిగీత ఎట్లాఉందో!

పెద్దాటకు మావాడు వెళ్ళనే వెళ్ళాడు. ఆనాడు ఆదివారం. ఉదయం తొమ్మిదింటికి వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనానికి రాలేదన్నాడు హోటలువాడు, నేను సాయంకాలం భోజనానికి వెళ్ళినప్పుడు.

రాత్రి ఎనిమిందిటికి హాజరు దొరగారు! తెల్లమొహమూ వాడు!

"ఎంత పోయిందిరా?"

"స్టౌ ఉందా? టీ కాయి! రోజల్లా తిండిలేదు."

"నీకు టీ ఎందుకింకా పైత్యాన పడటానికి?"

"ఫరవాలేదు కాయిరా! బోలెడంత చదవాలిసి ఉంది?"

"నీచదువూ, నువ్వూ! ఎంత వదిలించుకున్నావు?"

జానకిరాముడు జేబులో చెయ్యిపోనిచ్చి ఒక కాగితాలకుప్ప కిందపారేశాడు. అన్నీ నోట్లే.

"లెక్కపెట్టు! అరవై అయిదో ఎంతో ఉండాలి!"

"అందులో పది మన సీతాయికి బహుమానం ఇద్దాం. నాగరాజు బాకీ తీరుద్దాం. వాడికో అయిదు రూపాయలు పాకెట్ మనీకింద ఇద్దాం. మిగతాది ఇన్ని రోజుల్నించీ నేను ఖర్చు పెట్టింది?"

"మీ సీతాయెవరు?"

"ఎన్నడూ వినలా? ప్రాడిజీలు చాలా తక్కువగా ఉన్న ఈ పాడు ప్రపంచంలో వాడు పేకముక్కల ప్రాడిజీ!"

"అయితే?"

"అన్నట్టు వాడు తొమ్మిది గంటల బండిలో తిరిగి వెళ్లిపోతున్నాడు. మనం స్టేషనుకు పోవాలి."

"అన్నట్టు వాడెవడో పంతులు స్నేహితుడు బాగా ఆడతాట్ట! వాడి మీద ఎట్లా గెలిచావురా నువ్వు?"

"పంతులు స్నేహితుడెవరు? వాడే సీతాయి. మా పింతల్లి కొడుకయితే, పంతులు స్నేహితుడంటావేమిటి?"

"నాకర్థం కాలేదు? అతన్నేనా నువ్వు కొట్టింది?" జానకిరాముడు విరగబడి నవ్వాడు.

"అదోఫార్సు! ఇద్దరం మాట్టాడుకోవాలిసొచ్చింది. సరే తెల్లవారుజామున పంతులింటి బయట కలుసుకున్నాం. మేం మాట్టాడుకోటం తెలీదేమో? ఎదురుముఖాలుగా నుంచోటంలేదు. వాడు ముందునడవటమూ, నేను వాడివెనకే నడుస్తూ మాట్లాడటమూ, అట్లాగే మాట్లాడుతూ నడుస్తుంటే దూరాన పంతులూ మరొకడూ హాజరు. సరే నాకేమి దోచక రోడ్డుమీదవాణ్ణి బొక్కబోర్లా పడదోసి మీదెక్కి కూర్చుని కొట్టినట్టునటించి పక్కసందుగుండా దౌడుతీశాను. అయితే వాడితో ముందే రహస్యంగా చెప్పానుగనుక దెబ్బతగలకుండా వాడే పడ్డాడు..., ఏదిరా, టీ?"

"ఛా!"

***మొదటి ముద్రణ : మాధురి, ఏప్రిల్ 1935***